ఊరంతా సందడిగా వుంది. ఎక్కడ చూసినా ఫైనాన్స్ కంపెనీ ప్రారంభోత్సవ హడావుడే. ప్రారంభోత్సవం సరిగ్గా1.40కి జనాలు తండోపతండాలుగా ఫైనాన్స్ కంపెనీకేసి సాగిపోతున్నారు.

ప్రారంభోత్సవానికి సరిగ్గా మరో అరగంట వుండనగా ఉష ఫోటోగ్రాఫర్ సాయిరమేష్‌తో అక్కడకు చేరుకుంది. దూరంనుంచే వాళ్ళిద్దర్ని చూసిన సుందరమ్మ మధుమూర్తి కి ఆ విషయాన్ని చెవిలో చెప్పింది.

అతిధులకోసం వేసిన షామియానా క్రిందకు వస్తున్న ఉషను, సాయిరమేష్‌ను చూసి ముఖం చిట్లించాడు మధుమూర్తి . ఈ సమయంలో పొరపాటుగా కంపెనీ గురించి పత్రికల్లో బేడ్ వస్తే లక్ష్యం నెరవేరదు. పధకం పారదు.

"మరో ఫైనాన్స్ కంపెనీ" అనే మకుటాన్ని తను రాయబోయే న్యూస్‌స్టోరీకి పెట్టడానికి అప్పటికే నిర్ణయించుకుంది ఉష .

"మిష్టర్ రమేష్ వెంటనే కెమెరాలోంచి చూడకు. స్టేజిమీద కుడివేపున్న వారిపైకి కెమెరాను ఫోకస్ చేయి. జూమ్ వాడి ఆటోడ్రైవ్‌తో ఫోటోలు తీయి" చెప్పింది.

జనాలు సంబరానికి వచ్చినట్లు వస్తున్నారు. ఆమెకు గొంతెత్తి అరవాలనిపిస్తోంది. ఇదంతా భోగస్ అని--ఇది మరో చీటింగ్ కంపెనీ అని... మీ విలువయిన పొదుపుల్ని ప్రలోభపడి ఇక్కడ మదుపు పెట్టొద్దని... పిచ్చిగా అరవాలనిపిస్తోంది ఉషకు.

ఎన్నిసార్లు మోసం చేస్తే ఈ పిచ్చి ప్రజలకు బుద్ధి వస్తుంది? ఆమె వేవరిగ్‌గా అటూ ఇటూ లేడిపిల్లలా చూస్తోంది.

అంతలో మైక్‌లో ఎనౌన్స్ వచ్చింది. మరి కొద్దిసేపట్లో మంత్రి పట్టాభిగారు వస్తున్నట్లుగా.

ఉష ఆ ఎనౌన్స్‌మెంట్‌కి ఉలిక్కిపడి తేరుకుని మర్మగర్భంగా సాయిరమేష్‌వైపు చూసింది .

సర్రిగా అదేసమయంలో వైర్‌లెస్ మెసేజ్‌లో మంత్రిగారు వస్తున్నట్లు వార్త వచ్చింది యుగంధర్‌కి. క్షణాలలో ఎస్.పి. కారు సిద్ధం చేయబడింది.

యూనిఫామ్‌వేపోసారి పరికించి చూసుకుని అఫీసునుంచి బయటకొచ్చి కారెక్కాడు.

ఆ కారును డ్రైవ్ చేస్తున్న కానిస్టేబుల్ అప్పుడు యుగంధర్ గురించే ఆలోచిస్తున్నాడు.

ఎంతోమంది ఎస్.పిలు ఈ కారెక్కారు. మధుమూర్తికి పట్టాభిలకు లొంగినవాళ్ళు దర్జాగా సంపాదించుకుని మేడలు, కార్లు కొనుక్కుని వెళ్ళిపోయారు. మరి-ఈయన ఏ తరహానో తేలీదు, ఎలా నెగ్గుకు రాగలుగుతారో పాపం....

ఒక కానిస్టేబుల్ ఎస్.పి. గురించి జాలిపడేంత భయంకరమైన పరిస్థితులున్నాయి అక్కడ.

ఎస్.పి. కారు ఫైనాన్స్ కంపెనీ ముందాగింది. కారును చూస్తూనే అక్కడ డ్యూటీలో వున్న సి.ఐ రవీంద్ర మరో ఇద్దరు ఎస్.పి.లు హడావుడిగా వచ్చి సెల్యూట్ చేశారు. యుగంధర్

మందహాసం చేస్తూ కారుదిగి నలువేపులకు పరికించి చూశాడు.
దాదాపు ఐదారువేలమంది జనం అప్పటికే అక్కడే గుమిగూడారు. వాళ్ళందర్ని షామియానా క్రిందున్న కుర్చీలో కూర్చోబెట్టే ప్రయత్నంలో వున్నారు కొందరు కానిస్టేబుల్స్.

మరికొందరు ముఖద్వారం దగ్గర వరుసగా నిలబడి వున్నారు. పరిస్థితిని, పరిసరాల్ని క్షణాల్లో ఆకళింపు చేసుకున్న యుగంధర్ సింహద్వారం కేసి సాగిపోయాడు.

ఉష అప్పుడే యుగంధర్ వేపు చూసింది.

“ఎవరితను? కొత్త ఎస్.పినా?” ఉష పెన్, పేడ్ చేతిలోకి తీసుకుంటూ సాయిరమేష్‌ని అడిగింది.

“మన క్రైమ్ రిపోర్టర్ నిన్న చెప్పాడు. అతను బహుళ కొత్తగా వచ్చిన ఎస్.పి యుగంధర్ అయ్యుండాలి. చాలా స్ట్రిక్టట. నీతి, నిజాయితీలంటే ప్రాణమిస్తాడట...” సాయిరమేష్ యుగంధర్ కేసి కెమెరాను ఫోకస్ చేసుకుంటూ చెప్పాడు.

“అయితే ఎస్.పి. ఇంటర్వ్యూ తీసుకోవాలి ఈ సిటీలోనే అరాచకాల్ని ఎలా ఎదుర్కొంటాడో అడగాలి” అంది ఉష పేడ్‌మీద ఏదో రాసుకుంటూ.

“ఇప్పుడీ ఫైనాన్స్ కంపెనీ గురించి రాయాలనుకుంటున్నారు. అది ప్రమాదకరమైన పనని నా ఉద్దేశ్యం. ఆల్‌రడీ ఓసారి మీ మీద మర్డర్ ఎటెంప్ట్ జరిగింది. మంత్రిగారు వస్తున్నారు కనుక ఈ కంపెనీ ఓపెనింగ్‌కి న్యూస్ వేల్యూ వుందని మన చీఫ్ మనల్ని పంపారు. లేదంటే కవరేజ్‌కి పంపి వుండేవాళ్లు కాదు. మంత్రిగారు ఓపెన్ చేసిన ఫైనాన్స్ కంపెనీ అని ఓ ఫోటో, నాలుగులైన్ల మేటర్ ఇస్తే సరిపోతుంది”.

సాయిరమేష్‌కి ఉషంటే అభిమానమే కాదు-భయభక్తులు, గౌరవం కూడా వున్నాయి. అందుకే ఆమె ఆవేశానికి పగ్గం వేసే ప్రయత్నం పరోక్షంగా చేస్తున్నాడు.

“మరో ఫైనాన్స్ కంపనీ అనే హెడ్‌లైన్ పెసట్టి చివరలో ఆశ్చర్యార్థకపు మార్క్ పెడతాం” ఉష స్థిరంగా అంది యుగంధర్ కేసే సాలోచనగా చూస్తూ.

“అదిగో అదే మీదగ్గరున్న టెంపర్‌మెంట్.”

“చివర ఆశ్చర్యార్థకపు మార్క్ పెడితే ఆ కంపెనీని అనుమానించినట్లే కదా? ఎందుకండీ లేనిపోని రిస్క్ తీసుకుంటారు” రమేష్ మాట్లాడుతూనే పోలీస్ బందోబస్తుని ఫోటోలు తీస్తున్నాడు.

అంతలో కలకలం రేగింది. మైక్‌లో మంత్రిగారు వస్తున్నారంటూ ఎనౌన్స్‌మెంట్ నాలుగయిదు సార్లు రిపీట్ అయింది. చూస్తుండగానే మంత్రిగారు వచ్చేశారు.

డ్యూటీలో భాగంగా యుగంధర్ తన హేట్‌ని సర్దుకుంటూ ఎదురువెళ్ళాడు.

మంత్రి పట్టాభి కారు దిగుతుండగానే స్లోగన్స్ ఆ ప్రాంతంలో పెటిల్లుమన్నాయి.

దొరవారు హుందాగా నడుస్తూ మధ్యమధ్యలో నగర పెద్దల్ని పరామర్శిస్తూ, కార్యకర్తలకేసి చేతులు ఊపుతూ, తన మెడలో దండల్ని స్టయిల్‌గా ప్రజలకేసి విసురుతూ

స్టేజికేసి సాగిపోతున్నారు.

యుగంధర్ మర్యాదకోసం మంత్రిగారికి చేరువగ వెళ్ళి సెల్యూట్ చేశాడు.

దొరవారు కొద్దిక్షణాలు అక్కడే ఆగిపోయి యుగంధర్‌కేసి సాలోచనగా చూశారు.

"ఐయాం యుగంధర్ ...... న్యూలీ ఎపాయింటెడ్ ఎస్.పి." అన్నాడు యుగంధర్ మంత్రిగారికి తనని తాను పరిచయం చేసుకుంటూ.

ఇక అక్కడినుంచి మంత్రి గారు జనాలకేసి చూడకుండా ఎస్.పి.కి తనను ఫాలో అవమన్నట్లుగా సైగ చేసి ముందుకు సాగారు.

మంత్రిగారు స్టేజి ఎక్కేవరకు ప్రక్కనున్న యుగంధర్ ఆ తరువాత జనాల మధ్యకొచ్చి బందోబస్తు చూడటంలో నిమగ్నమయిపోయాడు. మంత్రిగారి దృష్టి యుగంధర్ మీదే వుంది.

ఇతనెలాగు తమ కార్యకలాపాలకు అడ్డుతగలక మానడు. ట్రాన్స్‌ఫర్ చేయించాలన్నా వెంటనే సాధ్యం కాకపోవచ్చు. హోం మినిష్టర్‌కి తనకి కొద్దిపాటి వైరం ఎప్పటినుంచో వుంది.

వెంటనే ట్రాన్స్‌ఫర్ చేయమని అడిగితే ఆ ఐ.జి దొర సామాన్యుడు కాదు. నా మాట వినడని సమాధానం చెప్పేస్తాడు. సి.ఎం. దగ్గరకి తీసుకెళ్లితే పని జరగవచ్చేమోకాని తర్వాత తన మీద అనుమానం రావచ్చు. అది తన మంత్రి పదవికే ముప్పు. ఎలా? ఇతన్ని ట్రాన్స్‌ఫర్ చేయించాలి? మంత్రిగారి ఆలోచనల నిండా యుగంధర్ నిండిపోయాడు.

ఫైనాన్స్ కంపెనీ ప్రారంభమైంది.

మంత్రిగారే స్వయంగా స్టేజిమీద ఒక స్కీమ్‌లో చేరిపోయారు. అ తరువాత మరికొంతమంది పెద్దలే ఎవరికి వచ్చిన స్కీమ్‌లో వారు చేరిపోయారు.

చూస్తుండగనే కొన్ని వందలమంది స్టేజి ప్రక్కనే అరేంజ్ చేసిన కంపెనీ కౌంటర్‌లో డబ్బుకట్టి స్కీమ్‌లో చేరిపోతున్నారు. అదంతా నాటకమని యుగంధర్‌కి తెలుసు.

కాని ఎలా?

ఎవరూ కంప్లయింట్ యివ్వకుండా ఎలా తను ఇన్వేస్టిగేషన్ చేయగలడు?

ఉష చకచకా నోట్స్ రాసుకుంటూ పోతోంది, సరిగ్గా కార్యక్రమం ప్రారంభమైన గంటకి అక్కడ పోగయిన జనం స్కీమ్స్‌లో చేరటం పూర్తయిపోయింది.

"ప్రియమైన ప్రజలారా! మీ దగ్గరున్న మా కంపెనీ రిసీట్స్‌మీద సీరియల్ నెంబర్స్ వున్నాయి. వాటిలోంచి యిప్పుడు గౌరవనీయులయిన మంత్రిగారు ఒక స్లిప్ తీస్తారు.

ఆ స్లిప్‌లో వున్న నెంబర్‌కి మీ దగ్గరున్న రిసిప్ట్ నెంబర్ సరిపోతే మారుతికారు బహుమతిగా ఇవ్వబడుతుంది. మీ మీ అదృష్టాన్ని యిపుడు మంత్రిగారు తేల్చబోతున్నారు."

అని ఓ వ్యక్తి వినయంగ మంత్రి పట్టాభి కేసి చూశాడు. మంత్రిగారు సీట్లోంచి లేచారు.

స్టేజికి ఎదురుగా కూర్చున్న సుందరమ్మ ఆసక్తిగా చూస్తోంది. లాటరీ తీసే డబ్బాలు రెండు తయారవుతున్నాయి. ఒకటి సరిగ్గా సమయానికి ఏమవుతుంది.

ఇక్కడ సుందరమ్మ యిలా ఆలోచిస్తున్నంతలో ఉషకి ఆ లాటరీలో ఏదో గోల్‌మాల్

వుందనిపించి చటుక్కున వేగంగ యుగంధర్ ముందుకు వచ్చింది.

"మిస్టర్ ఎస్.పి! ఐయామ్ ఉష, రిపోర్టర్ ఫ్రమ్ ఏ డైలి పేపర్. ఇప్పుడు జరగబోతున్న లాటరి విధానంలో ఏదో లోపం వుందని నాకనుమానంగా వుంది. విల్ యు, ప్లీజ్ టేక్ కేరాఫ్ ఇట్"?

యుగంధర్ ఆశ్చర్యంగా చూశాడు ఉషాకేసి. ఈ సీటులో ఈ మాత్రం ధైర్యం వున్నవాళ్లు కూడా వున్నారా?

అతను చప్పున తేరుకుని "ఓకే...మీ అనుమానాన్నే కంప్లయింట్‌గా తీసుకుంటున్నాను" అంటూ వేగంగా స్టేజికేసి సాగాడు.

దూరంగా వుండి ఇదంతా గమనిస్తున్న మధుమూర్తి వెంటనే మంత్రి పట్టాభి చెవిలో ఏదో చెప్పాడు. అప్పటికే స్టేజీ మీదకు లాటరీ బాక్స్ తేబడింది.

అందరూ దానికేసి ఆశగా చూస్తూ తమ తమ అదృష్టాన్ని తల్చుకుంటున్నారు.

మంత్రి పట్టాభి వేగంగా స్టేజికేసి దూసుకువస్తున్న ఎస్.పి.ని చూసి తల పంకించాడు.

వెంటనే మధుమూర్తికే వినిపించేలా ఏదో చెప్పాడు. క్షణాల్లో మధుమూర్తి అక్కడినుండి అదృశ్యమైపోయాడు.

అదంతా యుగంధర్‌తో పాటు ఉష కూడా గమనిస్తూనే స్టేజి దగ్గరకు వస్తోంది.

మంత్రి పట్టాభి లాటరి బాక్స్ దగ్గరకు వచ్చాడు.

సరిగ్గా ఆ సమయంలోనే యుగంధర్ అక్కడకు వచ్చేశాడు.

"సార్! ఓసారి నేను బాక్స్ చెక్ చేయాలి" అన్నాడు యుగంధర్ మంత్రి పట్టాభి కేసి చూస్తూ.

అప్పుడు మంత్రి కళ్ళల్లో కదలాడిన కోపాన్ని యుగంధర్ పసిగట్టాడు.

ఇప్పుడు బాక్స్ దగ్గర యాభైమందిదాకా వున్నారు. యుగంధర్ అన్నది అక్కడున్న అందరికీ వినిపించింది.

"ష్యూర్, ష్యూర్! మీ డ్యూటి మీరు చేయండి" అన్నాడు మంత్రి పట్టాభి.

యుగంధర్ పెట్టె తెరచి అందులో గుండ్రంగా మడిచివున్న కొన్ని స్లిప్స్‌ను బయటకుతీసి, విప్పిచూశాడు, పెట్టేలోకి చూశాడు. ఎలాంటి అనుమానం రాలేదు.

"వాట్ మిస్టర్ ఎస్.పి. ఈజిట్ రిలయబుల్?" అడిగాడు పట్టాభి కూల్‌గా.

అనుమానం యింకా తీరకపోయినా చూసేందుకు కారణం లేక "ఎస్ సర్!" అన్నాడు నెమ్మదిగా .

"చిన్నగా నాకు చెబితే సరిపోదు, అందరికి వినిపించేలా మైక్‌లో చెప్పండి ఎలాంటి ఫ్రాడ్ లేదని. అప్పుడే నేను లాటరి తీస్తాను. లేదంటే నా ప్రజలకు నేను జవాబుదారి అవుతాను. అసలలాంటి కం పెనీ యిది అని యిప్పుడే తేలిస్తే నేనిప్పుడే స్టేజి దిగి వెళ్లిపోతాను"